కాస్మోపాలిటన్ కాలనీ అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన కాలనీ అసోసియేషన్ సభ్యులు

మన్సూరాబాద్: కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని కోరుతూ మన్సూరాబాద్ డివిజన్ కాస్మోపాలిటన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనర్సింహ, ఉపాధ్యక్షులు యుగేందర్‌రెడ్డి, గిరిజాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి వనం భాస్కర్, కోశాధికారి నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణ ప్రారంభం

బడంగ్‌పేట్: మొబైల్, టీవీ, కంప్యూటర్ల నుంచి విద్యార్థులను కాపాడడానికి బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణా తరగతులను బడంగ్‌పేట్‌లోని లోటస్ ల్యాప్ స్కూల్‌లో ప్రారంభించారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను మేయర్ చిగురింత పారిజాత చేతులమీదుగా బుధవారం ఆవిష్కరించారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇస్తామని ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. ధ్యానం, ప్రాణాయామాలు, సూర్య నమస్కారాలు విద్యార్థులకు నేర్పించడంతో చెడు అలవాట్లకు విద్యార్థులు దూరం అవుతారన్నారు. ఇతర వివరాలకు 9603256572 నెంబరును సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా ఆలయం వార్షికోత్సవం

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమత లక్ష్మీగణపతి దేవాలయ 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వార్షికోత్సవం చివరి రోజు బుధవారం స్వామివారికి సిద్ధి బుద్ధి గణపతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, కాలనీలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ సుభాష్‌రెడ్డి, సభ్యులు నటరాజ్, అజిత్‌రెడ్డి, సుజిత్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, వెంకటకృష్ణారావు, అన్నాజీరావు, రామచంద్రారెడ్డి, బలరామకృష్ణ పాల్గొన్నారు.

జూన్ 20న ఏఐసీఎఫ్ వార్షికోత్సవం

కాచిగూడ: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలను జూన్ 20న సికింద్రాబాద్‌లోని అమృత వాణి హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు తెలిపారు. బుధవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన క్రైస్తవ ప్రముఖులకు క్రైస్తవ సేవా వజ్ర, క్రైస్తవ సేవా మిత్ర, క్రైస్తవ సేవా రత్న అవార్డులను అందించనున్నట్లు తెలిపారు. ఆయా రంగాల్లో సేవలందించిన వారు జూన్ 10 లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ గిడియోను బాబు ఏకేను సెల్: 9652799777 లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డేవిడ్ కదారి, యస్.ప్రదీప్, జయశ్రీ టైటస్, డాక్టర్ యస్. అబ్రహం, బిషప్ డాక్టర్ జి.సామ్యూల్ జాన్, బిషప్ యం.ఆరోన్, గ్రేస్ నిర్మల, పాస్టర్ ప్రవీణ్ కుమార్ పాక, బిషప్ వైఎస్‌ఎస్ మూర్తి, జి.స్టాన్లీ అంథోని, పాస్టర్ ప్రభాకర్, అమర్నాథ్, గిడియోను బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి: సీపీఎం



కంకర తేలిన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: గుంతలమయంగా మారిన పోల్కంపల్లి –రాయపోల్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం పార్టీ ఇబ్రహీంపట్నం మండల కార్యవర్గ సభ్యుడు జగన్ డిమాండ్ చేశారు. బుధవారం ధ్వంసమై కంకర తేలిన రోడ్డును సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా ధ్వంసమైన రోడ్డును కనీసం పట్టించుకోవడం లేదన్నారు. మూలమలుపులతో రోడ్డు ప్రమాదకరంగా మారిందన్నారు. ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి దాపరించిందని వాపోయారు. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసయిందని చెప్పారు. పలుమార్లు ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ప్రమాదకరంగా మారిన రోడ్డును బాగు చేయించి, రోడ్డు విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయపోల్ మాజీ ఎంపీటీసీ నీరుడు భిక్షపతి, సీపీఎం నాయకులు పల్లపు రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పూర్తయ్యేనా?

- ప్రకటనలకే పర్యాటక కేంద్రం
- ఆగిన నాగోలు చెరువు అభివృద్ధి పనులు
- కంపచెట్లతో నిండిన చెరువు కట్ట
- అసంపూర్తి పనులతో స్థానికులకు అగచాట్లు



నాగోలు చెరువు వాకింగ్ ట్రాక్ మధ్యలో ఆగిపోవడంతో కట్టపై పెరిగిపోయిన కంప చెట్లు

నాగోలు: చెరువు అభివృద్ధి అన్నారు.. వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు మినీ ట్యాంక్ బండ్‌లా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా మారుస్తామని ప్రకటించారు. పనులు చేపట్టి మధ్యలోనే నిలిపేశారు. ఫలితంగా పరిసర కాలనీవాసులు వాకింగ్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇదీ నాగోలు గ్రామంలోని చెరువు సుందరీకరణ పరిస్థితి.

◆ నాగోలు చెరువు అభివృద్ధి కోసం ఆరేళ్ల క్రితం గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ నిధులతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు కట్టపై మొక్కలను పెంచి, పర్యాటకులు సేద తీరేందుకు వీలుగా బెంచీలు కూడా ఏర్పాటు చేస్తామని అధికారులు అప్పట్లో ప్రకటించారు.

◆ చెరువు అభివృద్ధి పనులను ప్రారంభించిన అధికారులు వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం చెరువు కట్టపై కొంత దూరం మట్టిపోసి మధ్యలోనే వదిలేశారు. పనులను పునః ప్రారంభించకపోవడంతో చెరువు కట్టపై పెద్ద ఎత్తున కంప చెట్లు పెరిగిపోయాయి.

◆ దీంతో కట్టపై దారి లేక వాకింగ్ చేయలేకపోతున్నామని చెరువు సమీప కాలనీవాసులు వాపోతున్నారు.

◆ చెరువు సుందరకరణ పనులు పూర్తిగా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వాకింగ్ చేసేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని చెరువు సమీపంలోని నాగోలు, వెంకటరమణ కాలనీ, మమతానగర్, అరుణోదయనగర్ కాలనీ, పద్మవతి కాలనీ, బీకేరెడ్డినగర్, శ్రీనివాస్ కాలనీ, నువ్వులబండ కాలనీ వాసులు వాపోతున్నారు.

◆ ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నాగోలు చెరువును అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చెరువులో కలుస్తున్న డ్రైనేజీ..

◆ సుందరీకరణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వివిధ కాలనీల నుంచి పెద్ద ఎత్తున డ్రైనేజీ నీరు వచ్చి కలుస్తుండటంతో నాగోలు చెరువు అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగోలు చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తి చేయండి



నాగోలు చెరువు చుట్టూ చేపట్టిన వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రజా ప్రతినిధులు స్పందించి నాగోలు చెరువు సుందరీకరణ పనులు వెంటనే పూర్తి చేయాలి.

– బొడ్డుపల్లి కృష్ణ, నాగోలు



డ్రైనేజీ కలవడంతో మురికి కూపంగా మారిన నాగోలు చెరువు



సుందరీకరణకు నోచుకొని నాగోలు చెరువు

వరదనీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



హైకోర్టు కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: నియోజకవర్గ పరిధిలోని కాలనీల్లో వరదనీటి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ, బీడీఎల్ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు ఎగువ కాలనీల నుంచి వచ్చే వరదనీరు వల్ల తమ కాలనీల్లోని ఇళ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఆలయం నీట మునుగుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలు ముంపు బారిన పడకుండా నూతన ట్రంక్ లైన్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానిక సమస్యలపై తనకు అవగాహన ఉందని, గతంలోనే ట్రంక్ లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినా కొందరు స్థల యజమానులు తమ భూమి ఇవ్వడానికి నిరాకరించడంతో పనుల్లో ఆలస్యం జరుగుతోందని అన్నారు. ట్రంక్‌లైన్ నిర్మాణానికి కాలనీవాసులు సహాయ, సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్ బాబు, ఏఈ చంద్రశేఖర్, నాయకులు దీపావళి శ్రవణ్, శ్రీకాంత్, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, మురళి, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇంటర్ వాల్యూయేషన్‌లో తప్పిదాలపై విచారణ జరిపించాలి: ఏఐఎస్‌ఎఫ్

నాగోలు: ఇంటర్ జవాబుపత్రాల వాల్యూయేషన్‌లో తప్పిదాలపై విచారణ జరిపించడంతో పాటు నష్టపోయిన విద్యార్థులకు ఇంటర్ బోర్డు న్యాయం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతి డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు అధికారుల పర్యవేక్షణ కొరవడంతోనే వాల్యూయేషన్ చేసిన వారు తప్పుగా జవాబు పత్రాలను దిద్దడం వల్ల వేలాది మంది విద్యార్థులకు నష్టం వాటిల్లిందని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెరిట్ స్టూడెంట్స్‌కు మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు, రెండో సంవత్సరంలో వచ్చిన మార్కులు చూస్తే చాలా విచిత్రంగా ఉందన్నారు. రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌తో పేపర్లు తెప్పించుకుని చూస్తే పేపర్ వాల్యువేషన్ చేసిన వారి తప్పులు బయటపడ్డాయని అన్నారు. వాల్యుయేషన్‌లో తప్పుల వల్ల నష్టపోయిన విద్యార్థులందరికీ వెంటనే ఇంటర్ బోర్డు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ బోర్డును ముట్టడిస్తామని హెచ్చరించారు.

హడలెత్తిస్తున్న దారి దోపిడీలు

- సైదాబాద్ పీఎస్ పరిధిలో ఒకేరోజు రాత్రి రెండు ఘటనలు
- బాధితుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు

సైదాబాద్: సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల రాత్రి వేళల్లో జరుగుతున్న దారి దోపిడీ ఘటనలు స్థానికులను హడలెత్తిస్తున్నాయి. పీఎస్ పరిధిలోని సింగరేణి కాలనీలో రాత్రి సమయంలో కూడా మద్యం దొరుకుతుందన్న ఆశతో వచ్చే వారిని కొందరు యువకులు అటకాయిస్తున్నారు. బెదిరించి నగదుతో పాటు వారి వద్ద ఉన్న విలువైన వస్తువులు దోచుకుంటున్నారు. ఇదే తరహాలో సోమవారం రాత్రి సైదాబాద్ పీఎస్ పరిధిలో రెండు దోపిడీ ఘటనలు జరిగాయి.

కత్తితో బెదిరించి నగదు డిమాండ్ చేసి...

కామారెడ్డికి చెందిన యువకుడు రాహుల్ స్థానిక రెడ్డిబస్తీలో అద్దెకు ఉంటూ చదువుకుంటున్నాడు. సోమవారం రాత్రి అతను తన స్నేహితుడు వివేకానందతో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా సక్సెస్ స్కూల్ సమీపంలో ముగ్గురు యువకులు వారిని అటకాయించారు. కత్తి చూపించి బెదిరించి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి జేబులో ఉన్న నగదు తీసుకోవడమే కాకుండా తమకు ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేశారు. దీంతో రాహులు తమ ఇంటికి వస్తే ఇస్తానని అనడంతో దుండగుల్లో ఒకడు వివేకానందను తనతో ఉంచుకోగా, మిగతా ఇద్దరూ రాహుల్‌ను తీసుకొని ఇంటికి వెళ్లసాగారు. ఇంతలో అటుగా పోలీస్ పెట్రోలింగ్ వ్యాన్ రావడంతో వారిద్దరినీ వదిలేసి అక్కడి నుంచి ఉడాయించారు.

మద్యం కోసం వెళ్తే..

మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ ఖాదర్ అహ్మద్ సోమవారం రాత్రి బైరామల్‌గూడ వద్ద కస్టమర్లను కారు ఎక్కించుకొని అంబర్‌పేటకు బయలుదేరాడు. మార్గం మధ్యలో వారి అభ్యర్థన మేరకు సింగరేణి కాలనీలో మద్యం కోసం కారు ఆపాడు. అప్పుడే అక్కడికి చేరుకున్న నలుగురు యువకులు వారిని బెదిరిస్తూ కారులోని డ్రైవర్ ఫోన్ గుంజుకున్నారు. తన ఫోన్ ఇవ్వాలని కారు దిగి అడుగుతున్న డ్రైవర్‌పై దాడి చేసి అతడి వద్ద ఉన్న నగదు తీసుకున్నారు. అప్పుడే అటుగా పోలీస్ వ్యాన్ రావడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. మంగళవారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య తదితరులు

నాగోలు: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి ప్రథమ కౌన్సిల్ సమావేశం కందుల సుధాకర్ అధ్యక్షతన కొత్తపేట డివిజన్ న్యూనాగోలులో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై జంగయ్య మాట్లాడుతూ, సరూర్‌నగర్ మండలంలో సీపీఐకి ఎంతో చరిత్ర ఉందని, అనేక బస్తీలను స్థాపించిన ఘనత సీపీఐదేనని అన్నారు. స్థానిక సమస్యలపై కార్యకర్తలు నిరంతరం పోరాటాలు నిర్వహించాలని, అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్ రెడ్డి, సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, సహాయ కార్యదర్శులు సుధాకర్, రాములు గౌడ్, కమలమ్మ,మద్దిలేటి, భగత్ సింగ్ నగర్ శాఖ కార్యదర్శి జిల్లెల్ల కృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్‌తో పాటు 27 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలి

టీసీపీపీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్‌ఎంపీ, పీఎంపీలపైన రాష్ట్ర మెడికల్ కౌన్సిల్, విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు ఆపాలని తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఉక్కుల అశోక్ కోరారు. బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారామెడికల్ వైద్యులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న దాడుల వల్ల ఆర్‌ఎంపీ, పీఎంపీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సమస్యలను తీరుస్తామని హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీకి ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అండగా నిలిచారన్నారు. అక్రమంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలపై పెట్టిన కేసులు తొలగించాలన్నారు. స్పందించిన మంత్రి తప్పకుండా మీ సమస్యలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 27, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాబేజీ 16, ఫ్రెంచి బీన్స్ 135, క్యారెట్ 37, దొండ 18–23, చిక్కుడు 75, గోకర 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 55, ఆలు 31, దోస 23, సొర 13, పొట్ల 15, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 40. గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

వృద్ధుడి అదృశ్యం



చక్రపాణి (ఫైల్)

చంచల్‌గూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు తిరిగిరాని ఘటన బుధవారం మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కుర్మగూడ డివిజన్ మాదన్నపేటకు చెందిన బోగ చక్రపాణి (72) గత సోమవారం వైద్య పరీక్షల రిపోర్టులు తీసుకువస్తానని చెప్పి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి వెళ్లి రాత్రైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో చక్రపాణి కుమారుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ల దొంగను పట్టుకున్న వ్యాపారులు

చంచల్‌గూడ: కూరగాయలు కొనుగోలు కోసం మార్కెట్‌కు వచ్చిన వారి నుంచి మొబైల్ ఫోన్లు దొంగలిస్తున్న ఓ బాలుడిని వ్యాపారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.బుధవారం మాదన్నపేట మార్కెట్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాలుడి వద్ద మూడు ఫోన్లు ఉన్నట్లు వ్యాపారులు తెలిపారు. కాగా మార్కెట్‌లో సీసీ కెమెరాలు పని చేయకపోవడం సమస్యగా మారింది. మార్కెట్‌లో ఆకు కూరల వ్యాపారులు స్వచ్ఛందంగా కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రాగా కొందరు కావాలని అడ్డుకుంటున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఈ అంశంపై పోలీసులు కూడా చొరవ చూపకపోవడంతో రోజురోజుకూ మార్కెట్‌లో నేరాలతో పాటు అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి.

తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు



మావిళ్ల వెంకటయ్య (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడో ఓ యువ రైతు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రానికి చెందిన మావిళ్ల వెంకటయ్య (34) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి తన బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే అతడిని ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ఐదు రోజుల చికిత్స అనంతరం మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు వెంకటయ్య తండ్రి బజారు, భార్య పార్వతమ్మలకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు వెంకటయ్య లివర్, రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను జీవన్‌ధాన్‌కు దానం చేశారు.

1969 తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

కాచిగూడ: 1969లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసి జైలు జీవితం గడిపిన విద్యార్థి ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు అన్నారు. అప్పటి ఉద్యమకారులు వయస్సు పై బడి ఆర్థికంగా, ఆరోగ్య పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం కాచిగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సం సందర్భంగా ఉద్యమకారులను ప్రభుత్వం సత్కరించనున్నట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. జైలు జీవితం అనుభవించిన ఉద్యమకారుల వివరాలతో కూడిన జాబితాను ఇప్పటికే ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలకు అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఇప్పటికైనా వారిని గుర్తించి ఉద్యమకారులకు ఇళ్ల స్థలం, పింఛన్, ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పెండ్యాల, సుభాన్‌పూర్, ఘట్టుపల్లి గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రధానంగా మూత్రశాలలు, డైనింగ్ హాల్స్, వంట గదులు, ఇతర తరగతి గదులు, ప్రహరీల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఏఈ, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పాఠశాలలో టేబుళ్లను మరమ్మతులు చేయించాలన్నారు. అంతకు ముందు పాఠశాలలను పరిశీలించి నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకొని పరిష్కార మార్గాలను చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ రామ్ ప్రసాద్‌రెడ్డి, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాలాల పేరుతో రోడ్లు ధ్వంసం

- ఎస్‌ఎన్‌డీపీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- ఇబ్బందుల్లో వాహనదారులు



ఎస్‌ఎన్‌డీపీ నాలా వల్ల బీటీ రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డ వైనం

బడంగ్‌పేట్: వరదల నుంచి కాలనీలకు విముక్తి కల్పించేందుకు శాశ్వత ప్రాతిపదికన ఎస్‌ఎన్‌డీపీ పథకం పేరుతో వరదనీరు కాలనీలకు చేరకుండా తీసుకున్న నిర్ణయం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో కురిసిన భారీ వర్షాలు కారణంగా వందల కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఒక దశలో రెండు నెలల పాటు కాలనీలు వరదల్లో చిక్కుకుని ఇళ్లల్లో బాధితులు నిత్యావసర సరుకుల కోసం ఆర్తనాదాలు చేసిన సంగతి విదితమే. ఆ సమయంలో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రజల కష్టాలు చూసి శాశ్వత పరిష్కారంగా భావించి ఎస్‌ఎన్‌డీపీ పథకాన్ని బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్లకు, అలాగే జల్‌పల్లి మున్సిపాలిటీలకు తీసుకువచ్చారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు సుమారు రూ.58 కోట్ల ఎస్‌ఎన్‌డీపీ నిధులు మంజూరయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టారు. అయితే, కాలనీల మీదిగా, రోడ్డు మధ్య నుంచి ఎస్‌ఎన్‌డీపీ నాలా వెళ్తుండటంతో కొంత ఇబ్బందిగా ఉన్న కాలనీ వాసులు సహకరిస్తూ వస్తున్నారు. ఇదే అవకాశంగా భావించిన కాంట్రాక్టర్లు సీసీ రోడ్లను, ప్రధాన బీటీ రోడ్లను తవ్వి అలాగే వదిలివేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనుల వల్ల ఉన్న బీటీ రోడ్లు, సీసీ రోడ్లు రెండుగా విడిపోయాయి. ఈ రెండింటి మధ్యన గ్యాప్ పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు ఎన్‌డీపీ కాంట్రాక్టర్లతో మాట్లాడి రోడ్లను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మూడేళ్లైనా పూర్తి కాలేదు!



సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీల కోసం పాలకుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగి రోడ్లను బాగు చేసుకున్నాం. ఎస్‌ఎన్‌డీపీ నాలాల పేరుతో అన్ని తొలగించారు. మూడేళ్ల క్రితం పనులు మొదలుపెట్టి ఇంకా పూర్తి చేయలేదు. ఒక దశలో అడ్డుకున్నా ఫలితం లేకుండా పోయింది. కాలనీలతో పాటు ప్రధాన రోడ్లు సైతం తొలగించారు. నాలాల అభివృద్ధిని మేమే కోరుకున్నాం. అభివృద్ధి జరిగితే సంతోషం. కానీ, ఈ అలసత్వం ఏమిటి?. ప్రభుత్వం పట్టించుకోవాలి.

– అశోక్, సాయిప్రభుహోమ్స్ కాలనీ